క్లుప్తంగా

మొక్కల పెంపకంపై శ్రద్ధ తీసుకోవాలి



నాగిలిగొండలో మొక్కలను పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ విద్యాచందన

చింతకాని: నర్సరీల్లో మొక్కల పెంపకంపై గ్రామపంచాయతీ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించాలని డీఆర్‌డీఓ విద్యాచందన సూచించారు. మండలంలోని నాగిలిగొండలో నర్సరీ, పల్లెప్రకృతి వనం, ఈజీఎస్ ద్వారా నాటిన పండ్ల మొక్కలను మంగళవారం ఆమె పరిశీలించారు. ఇళ్లలో నాటుకునేలా మొక్కలను నర్సరీల్లో సిద్ధం చేయాలని, రహదారుల వెంట నాటిన మొక్కలను సంరక్షించాలని తెలిపారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయంలో ఉపాధి హామీ రికార్డులను ఆమె తనిఖీ చేశారు. సర్పంచ్ చాట్ల సురేష్, ఎంపీటీసీ చాట్ల భగవాన్, ఏపీడీ శ్రీనివాసరావు, ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎంపీఓ మల్లెల రవీంద్రప్రసాద్, ఏపీఓ కోటయ్యతో పాటు కొండపల్లి అనిల్‌కుమార్, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన పీడీ



రికార్డులను పరిశీలిస్తున్న ఐసీడీఎస్ పీడీ సంధ్యారాణి

తల్లాడ: మండలంలోని అన్నారుగూడెంలో 5వ అంగన్‌వాడీ కేంద్రాన్ని ఐసీడీఎస్ పీడీ సీహెచ్.సంధ్యారాణి మంగళవారం సందర్శించారు. అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారుల హాజరు, బోధన మరియు మెనూ ప్రకారం వంటలు, పిల్లల బరువును తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రంలో సౌకర్యాలను చూసి అంగన్‌వాడీ టీచర్ పద్మను అభినందించారు. అనంతరం చిన్నారులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో సీడీపీఓ కృష్ణకుమారి, సూపర్‌వైజర్ అభిమున్నీసా బేగం, పద్మ, ముత్యాలు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

మధిర/చింతకాని: మధిర ఎమ్మెల్యే మల్లు భట్టి విక్రమార్క సిఫారసుతో మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను మధిర మండలంలోని మాటూరుపేటకు చెందిన కె.పురుషోత్తంకు మంగళవారం అందించారు. చింతకానిలోని మత్కేపల్లిలో తోట శ్రీలతకు కాంగ్రెస్ నాయకుడు కంచం కోటేశ్వరరావు ఈ చెక్కు అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో న్యాయవాది నెల్లూరు రవి, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు తల్లపురెడ్డి కృష్ణారెడ్డితో పాటు చిలివేరు బుచ్చిరామయ్య, మాదాల నరసింహారావు, వెంకయ్య, తంబళ్ల కొండ, కరణం రాంబాబు, చిలువేరు శాంతయ్య, పుట్టా పుల్లారావు, కొంగల భాస్కర్ రావు, శ్రీను, నాయకులు రామారావు, నాగేందర్‌రావు, ప్రసాద్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

తల్లాడ: కాంగ్రెస్ పార్టీ గెలిస్తేనే అభివృద్ధి జరుగుతుందని ఏఐసీసీ సభ్యుడు సంభానీ చంద్రశేఖర్ అన్నారు. తల్లాడ మండలం పినపాక, కేశ్వాపురం, మంగాపురం, అంబేడ్కర్‌నగర్ గ్రామాల్లో మంగళవారం హాథ్ సే హాథ్ జోడో కార్యక్రమంలో ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రూ.2లక్షల రైతు రుణమాఫీ, రూ.500కే గ్యాస్ సిలిండర్లు, మొదటి ఏడాది 2లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు బైరెడ్డి మనోహర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రఘుపతిరెడ్డి, నాయకులు సుధాకర్, కృష్ణమూర్తి, కిరణ్, నాగిరెడ్డి పాల్గొన్నారు.

ఇద్దరు కానిస్టేబుళ్లకు ఉద్యోగోన్నతి..

సత్తుపల్లి: సత్తుపల్లి సబ్‌డివిజన్‌లోని ఇద్దరు కానిస్టేబుళ్లకు హెడ్‌కానిస్టేబుళ్లుగా ఉద్యోగోన్నతి లభించింది. సత్తుపల్లి టౌన్ పోలీస్‌స్టేషన్‌లో రైటర్‌గా పని చేస్తున్న వేంసూరు కానిస్టేబుల్ ఎన్.శ్రీనివాసరావు, సత్తుపల్లిరూరల్ పోలీస్‌స్టేషన్‌లో రైటర్‌గా పని చేస్తున్న మంచికంటి శ్రీనివాసరావులకు ఉద్యోగోన్నతి లభించగా మంగళవారం ఏసీపీ రామానుజం వారిని అభినందించారు.

సేవలతోనే సరైన గుర్తింపు

వైరా: సేవలతోనే ప్రజల్లోనైనా, సంఘాల్లోనైనా వ్యక్తికి మంచి గుర్తింపు లభిస్తుందని లయన్స్ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ కాపా మురళీ కృష్ణ అన్నారు. వైరాకు చెందిన లయన్స్‌క్లబ్ సీనియర్ నాయకుడు నంబూరి మధు లయన్స్ క్లబ్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్–2 గా ఘన విజయం సాధించిన సందర్భంగా సోమవారం రాత్రి వైరా లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆయనకు ఘన సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ చైర్మన్ వెంకటేశ్వరరావు, లయన్స్ క్లబ్ వైరా అధ్యక్షుడు నాగేశ్వరరావు, సెక్రటరీ వెంకటేష్, ట్రెజరర్ నాగేశ్వరరావు, లగడపాటి ప్రభాకర్‌రావు, ఉండ్రు శ్యాంబాబు, వర్తక సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎత్తి పోస్తలేవ్ !

నీరివ్వని ఎత్తిపోతల పథకాలు

- మెట్ట భూములకు అందని సాగునీరు
- పంట కోల్పోతున్న అన్నదాతలు
- పథకాలను పునరుద్ధరించాలని వినతి



కాలిపోయిన విద్యుత్ మోటార్లు (ఇన్‌సెట్) మత్కేపల్లిలో నిరుపయోగంగా ఉన్న ఎత్తిపోతల పథకం

చింతకాని: గ్రామీణ ప్రాంతాల్లో మెట్ట భూములకు సాగునీరు అందించి పొలాలను సస్యశ్యామలం చేసేందుకు గత ప్రభుత్వాలు కోట్లాది రూపాయలు ఖర్చు చేసి ఎత్తిపోతల పథకాలను నిర్మించింది. కానీ నిర్వహణ లోపం కారణంగా నిరుపయోగంగా మారాయి. మండలంలోని మత్కేపల్లి, తిమ్మినేనిపాలెం, సీతంపేట, జగన్నాధపురం, చింతకాని, లచ్చగూడెం, బొప్పారం గ్రామాల్లో నిర్మించిన ఎత్తిపోతల పథకాల్లో కేవలం చింతకాని, జగన్నాధపురం గ్రామాల్లోని ఎత్తిపోతల పథకాలు మాత్రమే పనిచేస్తున్నాయి. మత్కేపల్లి గ్రామంలో స్వర్ణజయంతి గ్రామస్వరాజ్‌గార్ యోజన పథకం కింద రూ. 27.64 లక్షల వ్యయంతో 194 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు మున్నేరుపై ఎత్తిపోతల పథకాన్ని నిర్మించారు. గత 15 ఏళ్ల క్రితం మున్నేరుకు వచ్చిన వరదలకు పథకానికి సంబంధించిన రెండు 30 హెచ్‌పీ విద్యుత్ మోటార్లు, స్టార్టర్లు, మీటర్లు పూర్తిగా పాడైపోయాయి. మోటార్ల మరమ్మతులకు రైతులు అధికారుల చుట్టూ చెప్పులు అరిగేలా తిరిగినప్పటికీ ప్రయోజనం శూన్యం. దీనితో ఆయకట్టు కింది ఉన్న 194 ఎకరాల్లో సాగుచేసిన పత్తి, మొక్కజొన్న, పెసర పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే బొప్పారం గ్రామంలో ఎత్తిపోతల పథకం కూడా విద్యుత్ సమస్యతో మోటార్లు, స్టార్టర్లు కాలిపోవటమే కాకుండా షెడ్ పూర్తిగా ధ్వంసమై పూర్తిగా నిరుపయోగంగా మారింది. దీనితో ఈ పథకం ఆయకట్టు కింద ఉన్న 100 ఎకరాల్లోని పంటపొలాలు బీడు భూములుగా మారాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లచ్చగూడెం ఎత్తిపోతల పథకం గత 15 ఏళ్ల నుంచి పనిచేయటం లేదు. విద్యుత్‌మోటార్లు, స్టార్టర్లు కాలిపోయాయి. దీనికి తోడు పైపులైన్ కూడా పూర్తిగా ధ్వంసమైంది. ఈ పథకం ఆయకట్టు కింద ఉన్న సుమారు వంద ఎకరాల్లోని పంటపొలాలకు సాగునీటికై ఇబ్బందులు పడుతున్నామని రైతులు వాపోయారు. సీతంపేట ఎత్తిపోతల పథకం గత 16 ఏళ్లుగా పనిచేయటం లేదు. ఫలితంగా 132 ఎకరాల్లోని పంటలకు సాగునీరు అందటంలేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిరుపయోగంగా ఉన్నటువంటి ఎత్తిపోతల పథకాలకు మరమ్మతులు చేపట్టి పునరుద్ధరించాలని రైతులు కోరుతున్నారు.

పంటలు ఎండిపోతున్నాయి..



ఎత్తిపోతల పథకం కింద నేను మొక్కజొన్న , మిర్చి పంటలు సాగు చేస్తున్నారు. కానీ ఇక్కడ నీరు లేక సాగుచేసిన పంటలు ఎండిపోతున్నాయి. వేలాది రూపాలయలు పెట్టుబడి పెట్టి పండించినా నీటి సమస్య కారణంగా పంట చేతికొచ్చే పరిస్థితి లేదు. పంటలు ఎండిపోతే తీవ్రంగా నష్టపోవాల్సి ఉంటుంది. కోట్ల రూపాయలు ఎత్తిపోతల పథకాలకు ఖర్చు చేస్తున్న ప్రభుత్వం.. మరమ్మతులు చేసి మా పంటలకు నీరందించాలి.

– నర్సింశెట్టి లక్ష్మీనారాయణ, రైతు, మత్కేపల్లి

సిద్ధాంత పరంగానే విమర్శిస్తా..



బాధిత కుటుంబానికి బీమా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

సత్తుపల్లిరూరల్: ఎన్నికలొస్తున్నాయని ఏదిపడితే అది మాట్లాడుతున్నారు.. నేను సిద్ధాంత పరంగానే విమర్శలు చేస్తా.. వ్యక్తిగత విమర్శల జోలికి వెళ్లలేదని సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. నిరుపేద కుటుంబాలకు పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందన్నారు. సత్తుపల్లి మండలంలోని రామానగరం, తాళ్లమడ గ్రామాలకు చెందిన ఒంటెద్దు వెంకటేశ్వరరావు, ఉండవల్లి వెంకటేశ్వరావుల కుటుంబాలకు పార్టీ ఇన్సూరెన్స్ రూ.2 లక్షల చెక్కులను బుధవారం ఆయన అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో రాజకీయంగా ఎవరి చరిత్ర ఏమిటో అందరికి తెలుసని.. దాని జోలికి వెళితే చాలా విషయాలు చర్చించాల్సి వస్తుందని.. ఏ నాయకుడు రోడ్డుమీద తిరగలేని పరిస్థితి వస్తుందన్నారు. ఎవరి ఆర్థిక వనరులు ఎలా సంపాదించుకున్నారో, ముసుగు వీరులు వచ్చి ప్రభుత్వాన్ని విమర్శించే పని పెట్టుకున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం ఏ కార్యక్రమం చేపట్టినా రాజకీయాలకు అతీతంగా పేదరికమే గీటురాయిగా సంక్షేమ పథకాలు అందిస్తుందన్నారు. వచ్చే నెల నుంచి డబుల్ బెడ్‌రూం ఇళ్లను రామానగరం నుంచి ప్రారంభిస్తామన్నారు. బీజేపీ ప్రభుత్వం కేసీఆర్ పథకాలను కాపీ కొడుతుందని.. అవికూడా సక్రమంగా అందించటం లేదన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు, శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి, వనమా వాసు, రామానగరం సర్పంచ్ వేల్పుల కళావతి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు యాగంటి శ్రీనివాసరావు, ఎంపీటీసీ మాలోతు సురేష్ పాల్గొన్నారు.

మాజీ ఎంపీ పొంగులేటి పర్యటన



వైరా: గురుకుల పాఠశాలలో వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి

వైరా/చింతకాని: మండలంలోని మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి మంగళవారం విస్తృతంగా పర్యటించారు. వైరాలోని బాలికల రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ప్యూరిఫైర్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. అనంతరం శ్రీరాముల కోటయ్య, మేకల వీరభద్రం కుటుంబాలను పరామర్శించారు. చింతకాని మండలంలోని నర్సింహాపురంలో మృతి చెందిన తల్లాడ లింగయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయాన్ని అందించారు. అలాగే చింతకానిలో ఇటీవల మృతి చెందిన టేకుమట్ల శ్రీను, తిప్పట్ల రవి, పాతర్లపాడులో మృతి చెందిన పద్మావతి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నర్సింహాపురంలో ఇటీవల వివాహం చేసుకున్న వారిని ఆశీర్వదించి నూతన వస్త్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ రాష్ట్ర వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, వైరా మున్సిపల్ చైర్మన్ జైపాల్, వైరా నియోజకవర్గ నాయకురాలు విజయాబాయి, పొంగులేటి అనుచరులు గుమ్మా రోశయ్య, వెంకటేశ్వరావు, నాగి, రాజశేఖర్, నాగేశ్వరరావు, చింతకాని సొసైటీ చైర్మన్ శేఖర్‌రెడ్డి, రైతుబంధు సమితి మండల మాజీ కన్వీనర్ మనోహర్‌బాబు, మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్లు, నాయకులు శ్రీను, సారిక సైదులు, గోవిందరావు, రహ్మతుల్లా తదితరులు పాల్గొన్నారు.

భట్టి పాదయాత్రను విజయవంతం చేయాలి



ఎర్రుపాలెంలో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఎర్రుపాలెం/ముదిగొండ: ఈ నెల 16నుంచి ఆదిలాబాద్ జిల్లాలో సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క చేపట్టనున్న పాదయాత్రను కార్యకర్తలు, నాయకులు విజయవంతం చేయాలని పీసీసీ మెంబర్ శీలం ప్రతాపరెడ్డి, మండల కమిటీ అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు కొమ్మినేని రమేష్‌బాబు కోరారు. మంగళవారం ఎర్రుపాలెం మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో పాదయాత్ర కరపత్రాలను ఆవిష్కరించారు. ముదిగొండ మండలం సువర్ణాపురంలో మాజీ జెడ్పీటీసీ పసుపులేటి దేవేంద్రం నివాసంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ యాత్రకు అన్ని అనుబంధ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నర్సింహారావు, శ్రీనివాసరెడ్డి, శ్రీనివాసరావు, నాగిరెడ్డి, వెంకటనర్సయ్య, లక్ష్మణరావు, కృష్ణారావు, బాషా, మధిర నియోజకవర్గ బి బ్లాక్ అధ్యక్షుడు వీరబాబు, ఉపాధ్యక్షుడు రమేష్, మండల ప్రధాన కార్యదర్శులు దేవేంద్రం, అంజయ్య, బీసీ సెల్ అధ్యక్షుడు కృష్ణ, మైనారిటీ సెల్ అధ్యక్షుడు గుడ్‌సాహెబ్, ఎస్టీ సెల్ అధ్యక్షుడు ధర్మానాయక్, ఎంపీటీసీ సభ్యుడు బిక్షం, జోన్ ఇన్‌చార్జులు అజయ్, రాఘవ, తదితరులు పాల్గొన్నారు.

అంధత్వ నివారణకు 'కంటి వెలుగు'



చింతకాని: కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న కొండబాల కోటేశ్వరరావు

చింతకాని: అంధత్వ నివారణే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కంటి వెలుగు పథకాన్ని ప్రవేశపెట్టిందని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు అన్నారు. మండలంలోని తిరుమలాపురంలో మంగళవారం కంటివెలుగు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం కంటివెలుగు కార్యక్రమం ద్వారా కంటి సమస్యలతో బాధపడుతున్న వారికి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా కళ్ల అద్దాలను అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామసర్పంచ్ బండి రమాదేవి, వైస్ ఎంపీపీ గురిజాల హనుమంతురావు, రైతుబంధు సమితి జిల్లా సభ్యులు మంకెన రమేష్, మండల వైద్యాధికారి వెంకటేశ్వర్లు, హెల్త్ సూపర్‌వైజర్ కృష్ణారావు, గ్రామ పంచాయతీ కార్యదర్శి రాధిక, బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి బొడ్డు వెంకట్రామయ్య, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరులో..

సత్తుపల్లి: మండలంలోని కొత్తూరు గ్రామంలో బుధవారం కంటి వెలుగు కేంద్రాన్ని సర్పంచ్ ఒగ్గు విజయలక్ష్మి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పీడీఓ సీహెచ్.సుభాషిణి, డాక్టర్ అమర్‌ఖాన్, గంగారం పీహెచ్‌సీ సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, నర్సింహారావు, ఎంపీటీసీ వెంకటేశ్వరరావు, ఆంజనేయులు, శ్రీనివాసరెడ్డి, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నారాయణపురంలో..

కల్లూరు రూరల్: మండలంలోని నారాయణపురం గ్రామంలో మంగళవారం కంటి వెలుగు కార్యక్రమాన్ని ఎంపీపీ బీరవెల్లి రఘు, జెడ్పీటీసీ సభ్యుడు కట్టా అజయ్‌ఉమార్, ఉపసర్పంచ్ శివాజి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ తబస్సుం, వైద్య, ఆరోగ్య శాఖ సూపర్‌వైజర్ రామారావు, మాజీ ఎంపీటీసీ సత్యనారాయణరెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

న్యూలక్ష్మీపురంలో..

ముదిగొండ: మండలంలోని న్యూలక్ష్మీపురంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కేంద్రాన్ని మంగళవారం జెడ్పీటీసీ సభ్యురాలు పసుపులేటి దుర్గ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసరావు, సర్పంచ్ వాగదాని కన్నయ్య, ఎంపీటీసీ సభ్యురాలు మాధవి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీవి ప్రజా వ్యతిరేక విధానాలు



కొణిజర్ల: పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నున్నా నాగేశ్వరరావు, నాయకులు

కొణిజర్ల/పెనుబల్లి: దేశంలో బీజేపీ వ్యవహరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరశిస్తూ జరుగుతున్న ఉద్యమాల్లో అన్ని వర్గాల ప్రజలు కలిసి రావాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు మాచర్ల భారతి పిలుపునిచ్చారు. మంగళవారం సీపీఎం మండల విస్తృత స్థాయి సమావేశం కొణిజర్లలో దొడ్డపనేని కృష్ణార్జునరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఈ నెల 17 నుంచి ప్రారంభం కానున్న జన చైతన్య యాత్రకు సంబంధించిన పోస్టర్లను స్థానిక నాయకులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం పెనుబల్లిలో కారల్‌మార్క్స్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణ, కుటుంబరావు, శ్రీనివాసరావు, చెన్నారావు, నారాయణ, విజయ, పద్మ, సీతారాములు, జిల్లా కమిటీ సభ్యుడు విఠల్‌రావు, మండల కార్యదర్శి తిరుపతిరావు, బాబు, సత్యం, రాజారావు, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీపై వర్గీకరణకోసం పోరాటం

తల్లాడ: ఎస్సీ వర్గీకరణపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై పోరాటం చేస్తామని ఎమ్మార్పీఎస్ జాతీయ అధికార ప్రతినిధి బొర్ల బిక్షపతి మాదిగ అన్నారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో మాదిగల సంగ్రామ పాదయాత్ర సాగింది. ఈ సందర్భంగా బిక్షపతి మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ చేయకపోతే బీజేపీని గ్రామాల్లోకి అడుగు పెట్టనివ్వమని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంఎస్‌పీ ఖమ్మం జిల్లా కో–ఆర్డినేటర్ వెంకటేశ్వరరావు, నాయుకులు రవి మాదిగ, సురేష్, వెంకటేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



కల్లూరు: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నంబర్లు వేస్తున్న అధ్యాపకులు

వైరా: ఇంటర్ పబ్లిక్ పరీక్షలకు గాను అధికారులు అన్ని ఏరాట్లు చేశారు. వైరాలో మొత్తం నాలుగు సెంటర్‌లలో పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ పరీక్ష కేంద్రాల్లో మొత్తం 879 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతాయన్నారు. పరీక్షా కేంద్రం వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా 144 సెక్షన్‌ను అమలు చేయటం జరుగుతుందని తెలిపారు.

చింతకాని: మండలంలోని నాగులవంచ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నేటి నుంచి జరగనున్న ఇంటర్ వార్షిక పరీక్షలకు సర్వం సిద్ధం చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ నవీన్‌బాబు మంగళవారం తెలిపారు. ఈ పరీక్షలకు మొత్తం 309 మంది విద్యార్థులు హాజరవుతారన్నారు.

సత్తుపల్లి టౌన్: పట్టణంలో ఏడు పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నారు. మొదటి సంవత్సరం ఇంటర్ పరీక్షలకు సుమారు 1400 మంది విద్యార్థులు హాజరుకానున్నారు.

ముదిగొండ: ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ముదిగొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల సీఎస్ శేషుప్రసాద్ తెలిపారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం175మంది ఇంటర్ ద్వితీయ సంవత్సరం 167మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు.

ఎర్రుపాలెం: పరీక్షల ఏర్పాట్లు పూర్తి చేసినట్లు బనిగండ్లపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.రమణారెడ్డి, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ కమలకుమారి మంగళవారం తెలిపారు. బనిగండ్లపాడు కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో బనిగండ్లపాడు, ఎర్రుపాలెంలోని ఎస్‌జేకేఎం, గురుకుల, కస్తూర్బాగాంధీ కళాశాలల అభ్యర్థులందరూ మొత్తం 327 మంది పరీక్షలకు హాజరుకానున్నట్లు వారు తెలిపారు.

కల్లూరు: కల్లూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షల ఏర్పాట్లు పూర్తయ్యాయని ఎగ్జామ్ చీఫ్ సూపరింటెండెంట్ ఎస్‌కే.అతహార్ అలీ అన్నారు. ప్రథమ సంవత్సరం పరీక్షలకు 344 మంది, ద్వితీయ సంవత్సర పరీక్షలకు 428 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు అవుతున్నారని తెలిపారు.

కారేపల్లి: ఇంటర్మీడియట్ పరీక్షలకు కారేపల్లిలోని రెండు పరీక్షల కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు పరీక్షల ఛీప్ సూపరింటెండెంట్‌లు మోహన్, రాంప్రసాద్‌లు మంగళవారం తెలిపారు. ఈ పరీక్ష కేంద్రాల్లో 1077 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.

బాలల పరిరక్షణకు అవగాహన

కల్లూరు రూరల్: మండలంలోని ఎర్రబోయినపల్లిలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాలల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో గ్రామసర్పంచ్ సింగిసాల పద్మ ప్రసాద్ అధ్యక్షతన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాలల పరిరక్షణ విభాగం జిల్లా సోషల్ వర్కర్ జె.అన్నపూర్ణ పాల్గొని అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తల్లి తండ్రులు తమ పిల్లల పట్ల జాగ్రత్తలు తీసుకోక పోవటం వల్ల అనేక ఇబ్బందులు ఎదురౌతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ సామ్రాజ్యం, ఏసీడీపీఓ రత్తమ్మ, సూపర్ వైజర్ సుజాత, అంగన్‌వాడీ టీచర్లు విజయలక్ష్మి, యశోద, ఆదిలక్ష్మి, ఆశావర్కర్లు మణి, తిరుమల, సువార్త గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

వైరారూరల్: మండలంలోని గంగవరం జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థినీ విద్యార్థులకు మంగళవారం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎండకాలంలో వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. రక్తహీనత తదితర పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం కూరాకుల సైదయ్య, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది రూబి, కావ్య, కృష్ణకుమారి, విజయనిర్మలా, సావిత్రి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

అఖిలపక్ష నాయకుల రాస్తారోకో..



రాస్తారోకో చేస్తున్న అఖిలపక్ష నాయకులు

ఎర్రుపాలెం: మండలంలోని పెద్దగోపవరం టూ భీమవరం వరకు బీటీ రోడ్డుపై నిర్మాణంలోని కల్వర్టులన్నీ పూర్తి చేయాలని అఖిలపక్ష నాయకులు మంగళవారం రాస్తారోకో చేశారు. అయ్యవారిగూడెం సమీపంలోని కల్వర్టు వద్ద సీపీఎం, టీడీపీ, కాంగ్రెస్ నాయకులు నిరసన రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, సీపీఎం మండల కార్యదర్శి దివ్వెల వీరయ్య, స్థానిక సర్పంచ్ గోసు రామారావులు మాట్లాడారు. అసంపూర్తిగా ఉన్న ఈ కల్వర్టుల కారణంగా ఎందరో వాహనదారులు ప్రమాదాలకు గురైయ్యారని తెలిపారు. అధికారులు కాంట్రాక్టర్లకు వత్తాసు పలుకుతూ నేటికి వాటి నిర్మాణం పూర్తి చేయలేదన్నారు. దీంతో సంఘటనా స్థలానికి ఎస్సై సురేష్ వెళ్లి రాస్తారోకో చేస్తున్న వారికి నచ్చచెప్పి విరమింపచారు. సమస్యపై ఆర్‌అండ్‌బీ అధికారులతో మాట్లాడి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసరెడ్డి, నర్సింహారావు, కోటేశ్వరరావు, హనుమంతరావు తదితరులున్నారు.

విజయలో వర్క్‌షాప్

కొణిజర్ల: మండలంలోని తనికెళ్లలోని విజయ ఇంజనీరింగ్ కళాశాల బీటెక్, సీఈసీ విద్యార్థులకు కెర్నల్ మాస్టర్స్ వారి ఆధ్వర్యంలో ఇండస్ట్రీయల్ ఎంబాడెడ్ సిస్టమ్, ఐఓటీ పై మంగళవారం ఒక్క రోజు వర్క్‌షాప్ నిర్వహించారు. కెర్నల్ మాస్టర్ రిసోర్స్ పర్సన్ కిషోర్ కుమార్ విద్యార్థులకు కోర్ జాబ్స్ గురించి వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ జాన్ బాబు, వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాసరావు, ఈసీఈ హెచ్‌ఓడీ ఆయేషా తరుణమ్ వివిధ విభాగాల హెచ్‌ఓడీలు పాల్గొన్నారు.

వితరణల వెల్లువ..

ముచ్చవరం పాఠశాలకు రూ.లక్ష ..



పాఠశాలకు చెక్కు అందిస్తున్న దృశ్యం

కల్లూరురూరల్: ముచ్చవరం ప్రాథమికోన్నత పాఠశాలకు ఆ పాఠశాల పూర్వ విద్యార్థి ప్రకాశరావు రూ.50వేలు హెచ్‌ఎం వెంకటేశ్వర్లకు అందించారు. అలాగే తల్లాడ మండలంలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న పోలూరి వెంకటేశ్వరరావు ఎస్‌ఆర్‌ఐ ఫౌండేషన్ ద్వారా రూ.50 వేలు మొత్తం లక్షరూపాయలు విద్యార్థులకు బల్లలు సమకూర్చడానికి సహకరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ అజయ్‌కుమార్ ఎంపీపీ రఘు, ఎంపీడీఓ రవికుమార్, ఎంఈఓ దామోదరప్రసాద్, సర్పంచ్ వెంకటేశ్వరావు, ఎంపీటీసీ పద్మావతి, ఎస్‌ఎంసీ చైర్మన్ స్వప్న, డీసీసీబీ వైస్ చైర్మన్ కొండలరావు, ఉపసర్పంచ్ వెంకటేశ్వరావు, హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, విద్యా కమిటీ చైర్మన్ స్వప్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉమామహేశ్వరరావుకు..

కారేపల్లి: ఇటీవల అనారోగ్యానికి గురైన కారేపల్లికి చెందిన నాయకుడు నర్సింగ్ ఉమామహేశ్వరరావును కాంగ్రెస్ వైరా నియోజకవర్గ నాయకుడు మాలోత్ రాందాస్ నాయక్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు టోనీ వీరప్రతాప్, సీపీఎం నాయకులు నాగేశ్వరరావు, సీతారాములు, నాయకులు తాజుద్దీన్, భీముడు నాయక్, గాంధీ, జానీ, సొసైటీ డైరెక్టర్ హీరాలాల్ పాల్గొన్నారు.

వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం..

వైరా: వైరా మున్సిపాలిటీ ఏడో వార్డుకు చెందిన వేల్పుల అనీల్ ఈ నెల 11న ఏన్కూరు మండల కేంద్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి యూత్ నాయకులు రాజశేఖర్, సైదులు, మధు, కోటేశ్వరరావులు రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు.

పాఠశాలకు కుర్చీలు..



కుర్చీలు అందజేస్తున్న దాతలు

ఏన్కూరు: స్థానిక కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయానికి పరిష సీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం 20 కుర్చీలను వితరణ చేశారు. ఇంటర్, పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు అందించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి జయరాజ్, కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం ప్రత్యేకాధికారి ఉషారాణి, ఉపాధ్యాయులు, ట్రస్ట్ సభ్యులు స్వరాజ్యలక్ష్మి, మురళీకృష్ణ పాల్గొన్నారు.

శ్మశాన వాటిక అభివృద్ధికి..

కారేపల్లి: మండలంలోని గాదెపాడు గ్రామ శ్మశాన వాటిక అభివృద్ధికి గాదెపాడు ఎంపీటీసీ సభ్యురాలు భూక్యా సోనీజావమ్లాలు రూ.5 వేలు సాయం అందించారు. ఈ నగదును గ్రామ పెద్దలకు మంగళవారం అందజేయటం జరిగింది.

అటెన్షన్ ప్లీజ్



అలంకార ప్రాయమేనా..?



వీధి కుక్కల దాడిలో అనేక మంది పిల్లలు, పెద్దలు గాయాలపాలౌతున్నారు. వీటిని నియంత్రించేందుకు సత్తుపల్లి మున్సి పాలిటీలో రూ.7 లక్షలతో జంతు జనన నియంత్రణ కేంద్రం నిర్మించారు. ఇది నిర్మించి నాలుగు నెలలు కావస్తున్నా ఇప్పటి వరకు ప్రారంభానికి నోచుకోక.. అలంకార ప్రాయంగా మారింది. పట్టణంలో వీధి కుక్కల ఆగడాలను అరికట్టి.. మాకు రక్షణ కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

– సత్తుపల్లిటౌన్

ప్రశ్నించాల్సిన అధికారి : కె.సుజాత, మున్సిపల్ కమిషనర్, సత్తుపల్లి
సెల్ నంబర్ : 80088 01220